IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# ‘వరంగల్ జిల్లా కథా సర్వస్వం’- వస్తు వైవిధ్యం

**తేజావతు అశోక్**
**పరిశోధక విద్యార్థి**
**తెలుగు శాఖ**
**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

## పరిచయం:

సమాజ దర్పణం సాహిత్యమని ‘మాక్సిమ్ గోర్కీ’ అన్నట్లు సాహిత్యానికి, సమాజానికి విడదీయరాని సంబంధం ఉంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో కథ ఒకటి. కథ చెప్పడం ఒక కళ. ఆదిమ కాలం నుంచి వుంది. భాష పుట్టినప్పటి నుంచి కథ చెప్పడం, వినడం వుంది. తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు రాసిన మొదటి కథ ‘దిద్దుబాటు’ మొదలుకొని ఇప్పటి వరకు అనేక కథలు వెలువడ్డాయి. నేటికి కథా సాహిత్య ప్రక్రియ అత్యంత ఆదరణ పొందుతుంది.

## ‘వరంగల్ జిల్లా కథా సర్వస్వం’-వస్తు వైవిధ్యం:

‘వరంగల్ జిల్లా కథా సర్వస్వం’లో వరంగల్ జిల్లా కథా రచయితలు, రచయిత్రులు ఎవరికి వారే ప్రత్యేకమైన శైలితో రచనలు చేశారు. ఈ సర్వస్వంలో నూట ఎనిమిది కథలు ఉన్నాయి. ప్రతి కథ కూడా ఎంతో వైవిధ్య భరితంగా వున్నాయి. ఈ కథలో వస్తు వైవిధ్యం పరిశీలించినట్లయితే సామాజిక సంబంధ కథలు, ఆర్థిక సంబంధ కథలు, కుటుంబ సంబంధ కథలు, స్త్రీ సంబంధ కథలు, విద్య సంబంధ కథలు, వర్గ సంబంధ కథలు మొదలైన కథలు ఉన్నాయి.

## సామాజిక సంబంధ కథలు:

వరంగల్ జిల్లా కథా రచయితలు, రచయిత్రులు రాసిన కథలు సామాజిక నేపథ్యంలో రాశారు. సామాజిక బాధ్యత కలిగిన రచయిత, రచయిత్రి తమ రచనల ద్వారా సమకాలీన జీవిత వాస్తవికత, అవగాహన కలిగి వుంటారు. కథ అనేది సమకాలీన జీవిత వాస్తవికతను చిత్రించడమే అని చెప్పవచ్చు. సామాజిక సంబంధ కథలను పరిశీలిస్తే వాటి దృక్పథాలు కింద విధంగా తెలుస్తాయి.

### హేతువాద దృక్పథం:

పొట్లపల్లి రామారావు రాసిన కథ “**గజేంద్రమోక్షం”.** ఈ కథ హేతువాద దృక్పథానికి చెందినది. ఈ కథలో మనుష పాత్రలు ఉండవు. కోళ్లు తెల్లవారుతుండగా ఏదో మునిగిపోతుండగా ఏదో తమ గాడని ఎవరికో చెబుతున్నట్లుగా అరుస్తాయి. వాటి పక్కనే ఉన్న ఒక కోడి మాత్రం అరుస్తున్న కోళ్లను చూసి చిదిరించుకుంటుంది. తల బద్దలు చేసే వాటి భీషణ ధ్వనులు తన కలను చెరిగిపోయేలా చేస్తున్నాయని అనుకుంటుంది. ఆ కోడి మూగ గొంతుతో ఏమీ మాట్లాడలేక ఏదో గీత బోధ చేయడానికి అన్నట్టుగా తాపత్రయ పడుతుండేది. గొంతు రాకపోవడంతో ఇలా అనుకుంటుంది.

"చక్కగా నిద్రపోక ఏమిటి వీటి ఆగడం ! ఎందుకొచ్చిన కూతలివి? ఏమి దేవుడు? మీరంతా కలిసి పెడబొబ్బలు చేయండనే దేవుడు యిచ్చాడా ! యీ చక్కని గొంతులు? నిజంగా ! ఆ దేవుడు గనక ఉంటే వీటి రణగొణ ధ్వనులకు విసిగి ఎప్పుడో వీటి నోరు నొక్కి యుండును. ఎప్పుడో ఒంటరిగా ఉల్లాసంగా పాడుకునే ఈ గొంతును ప్రార్థనలంటూచించుకుంటున్నారు. ఏమి దేవుడి కేమన్నా చెవుడా? లేకపోతే నెత్తిన నోరు పెట్టుకొని ఎందుకు అరవాలె? నాకే గనక ఆ చక్కని గొంతు ఉంటేనా! యిట్లా ఈ దేవుడి కోసం, పిడికెడు గింజలతో నిండేపొట్ట కోసం, ఆలోచించుకునే వానినే కాదు. తెల్లవారు లేవడంతోనే ఆ దేవుణ్ణి ప్రార్థించాలని యీ ముసలి దెయ్యాలంటాయి. ఎందుకంటే, దేవుడు మనల సృష్టించాడు. ఆహారాన్ని కల్పించి సాకుతున్నాడంటాయి. ఏమి! ఆ దేవుణ్ణి సృష్టించమని ఎవరు ప్రాధేయపడ్డారు?సృష్టించకనే ఊరుకోకపొయ్యాడా! ఇక తన లీలకోసమే ప్రాణికోటిని సృష్టించుకుంటే, ఆహారాన్ని కూడా తన లీల కోసరమే కల్పించుకున్నాడు. అలాంటప్పుడు భూమిపై దొరికే విత్తుల కోసరం, కాలవల్లో దొరికే నీరు కోసరం, ఆయన్ను ఎందుకు ప్రాధేయపడాలె? ఆ ప్రాధేయపడ్డా మాత్రము, అయ్యో అని ఆయన ఏమైన నోట్లో తెచ్చి పెడుతున్నాడా ఆహారము? ఒకవేళ ఈ ప్రార్థనలు విని అట్లా మూటగట్టు కొని తెచ్చిపెట్టే దేవుడు గనక ఉంటే, నేను ఓ వరము కోరేదాన్ని, సృష్టిలో అన్ని సౌకర్యాలు కల్పించాడని తెలిసిగూడ, మళ్ళీ తెలివి తక్కువగా అరచే వీళ్ళ గొంతులు నులిమివేయమనే దాన్ని ప్రార్థనలు వినటానికి అలవాటు పడ్డదేవుడు నా ప్రార్థనలు మాత్రము వినకపోతాడా! ఇంకా యిట్లాగే ఏమన్న మాట్లాడితే ఈ ముసలతొక్కులు గుడ్లుతీసి 'మన ప్రాణాలు నిత్యం కాపాడటం లేదా' అంటాయి. ఎన్నటికీ పోని ప్రాణాలైతే ఈయన కాపాడేది ఏముంది? ఇక అది యిది ఏదిగాక ఆయన చేతుల్లోని బొమ్మలము గనగ అయితే ఒకరిచేత తిట్లు ఒకరిచేత దీవెనలు ఎందుకుపడతాడు ఈ దేముడు?"**(వరంగల్ జిల్లా కథా సర్వస్వం, పుట:167)** అని ఆ కోడి లోనా గోనుక్కుంటూ ఉండేది. మిగతా కోళ్ళు ఆ మూగ కోడిని చూసి తమను తమ ఆచారాన్ని కళంకితము చేస్తున్నట్టు దాని వైపు అసహ్యంగా చూసేవి.

ఈ కథలో రచయిత ప్రధానంగా హేతువాద దృక్పథంతోనే కాకుండా నీతిని ప్రవేశపెట్టారు. సమాజంలో జరుగుతున్న వాస్తవిక పరిణామాన్ని కళ్ళకు కట్టినట్లుగా జంతువుల రూపంలో చెప్పడం జరిగింది. ఈ కథలో ప్రధానంగా నీతి ఏమిటంటే కుల, ఆచారాలతో కట్టుబడి ఉన్నటువంటి మనుషుల ప్రవర్తన తీరు మిగతా వాటి మీద ఏ విధంగా ప్రభావం చూపుతుందో ఈ కథలో క్షుణ్ణంగా వివరించారు. దేవుడు లేడని భావన మిగతా వారికి తెలియకుండా ఉండటాన్ని రచయిత చెప్తున్నారు. ప్రశ్నించేవాడికి అణచివేయటమనే దుర్మార్గపు ఆలోచన ఈ కథలో కనిపిస్తుంది. ఆ మూగకోడి తన భావాలను మిగతా వారికి ఎక్కడ పడుతుందన్న భయంతో మిగతా కోళ్ళు దానిని కులం నుండి బహిష్కరిస్తుంది. వ్యతిరేక భావజాలాన్ని ఈ కథలో ప్రదర్శించారు. ఏ దేవుడు తమకి ఆహారం నీళ్లు పెట్టారు. తమ సొంత కాళ్ళ మీద తామే స్వయంగా నిలబడాలి. సాటివారి పట్ల మానవీతను చాటుకోవాలని దృక్పథం ఈ కథలో మనకు రచయిత చెప్పడం జరిగింది.

### రజాకార్ల వ్యవస్థ:

అడ్లూరి అయోధ్య రామయ్య రాసిన కథ "**చీకటి రాజ్యం**". ఆనాడు తెలంగాణ ప్రాంతంలో పట్టిపీడిస్తున్నటువంటి రజాకారులను ఇతివృత్తంగా చేసుకొని రాసిన కథ. తెలంగాణ ప్రాంతంలో ప్రజలను హింసించి ప్రజలను దోచుకున్న తీరును, రజాకారులను చేసిన మోసాలను ఈ కథలో కన్పిస్తుంది. ఈ కథలో రజాకార్లు గ్రామాల మీదపడి అమాయక ప్రజలను హింసించి చంపేయడం జరుగుతుంది. ప్రాణ భయంతో ప్రజలు అడవి బాట పడతారు. ఆ గ్రామంలో సేవాదళం వారు రజాకారుల నుండి సామాన్య ప్రజలను కాపాడడానికి ఎంతో ప్రయత్నం చేస్తారు.

ఒక్కసారి రజాకార్లు తమ గ్రామం పై దాడి చేయడానికి వస్తున్నారని తెలిసి సేవాదళ్ వారు ఎదురు దాడి తిరిగి చేస్తారు. అందులో ఆరుగురు రజాకార్లను చంపేయడం జరుగుతుంది. ఆ దాడికి రజాకార్ల నాయకుడు వెనక్కి భయపడి వెళ్ళిపోతాడు. ఈ కథలో ప్రధాన పాత్రగా లక్ష్మి. ఈమె అసలు

పేరు హమీదా. ఈమెను గౌరమ్మ పెంచుతుంది. గౌరీ ఇంటి పక్కనే ఉండేవారు. రెహమాన్ హమీదా తండ్రి. తొమ్మిది నెలలు ఉన్నప్పుడు ఊరు వదిలి రజాకార్లో చేరాడని ఒక వార్త ఉంటుంది.

హమీదా తల్లి అనారోగ్యంతో చనిపోతుంది. చనిపోతూ హమీదను గౌరమ్మ చేతిలో పెట్టి పోతుంది. అప్పటినుంచి గౌరమ్మే హమీదను పెంచుతుంది. హమీద పేరును మార్చి లక్ష్మి అని నామకరణం చేస్తుంది. రజాకార్ల దాడి నుంచి తప్పించుకోవడానికి వేరే ప్రాంతాలకు వెళ్తారు. మార్గమధ్యంలోనే ఎండ తీవ్రతకు గౌరమ్మ చనిపోతుంది. లక్ష్మిని ఎలాగైనా సరిహద్దుల అవతల చేర్చాలని మల్లయ్య అనే వ్యక్తిని పిలిచి రామచంద్ర సేవాదళ్ నాయకుడు చెప్తాడు. 'సరిహద్దుల అవతల రజాకార్లు స్త్రీలను అవమానపరిచి ఇల్లు తగలబెట్టి లూటీలు చేసే పోలీసులు ఉండరు. తనకి అన్నం కావాలన్నా, బట్ట కావాలన్నా అన్న వారిని నానా హింసలు పెట్టే కర్కశపాలన ఉండదు. స్వతంత్ర వాయువులను పిలుచుటకై కాంగ్రెస్కులంతా ఉత్సాహంతో అడుగులు వేస్తుంటారు' అని లక్ష్మి అనుకుంటుంది. ఇంతలోనే రజాకార్లు వారిపై దాడి చేస్తారు. లక్ష్మి రజాకార్ల చేతిలో చిక్కి మరణిస్తుంది. ఆ రజాకార్ కూడా లక్ష్మి తండ్రినే. లక్ష్మి ముఖం మీద మొఖమానించి మసక చీకట్లో చూస్తాడు. ఏదో పూర్వస్మృతి వస్తుంది హృదయం కొట్టుకుంటుంది. దగ్గరగా చూసి తన కూతురైన హమీదను చూసి తల్లడిల్లిపోతాడు. తొమ్మిది నెలలకు పూర్వం కడసారిగా చూసిన తన ముద్దుబిడ్డ హమీద ఇప్పుడు ఈ అడవిలో ఈ కటిక చీకట్లో ఒక సైతానికి బలైపోయిందని బాధపడుతూ ఉంటాడు. వెనుక నుండి వస్తున్న తుపాకీ దెబ్బకు రెహమాన్ కూడా చనిపోతాడు. సేవాదళ్ నాయకుడు రామచందర్ మరణించిన లక్ష్మిని చూసి ఏడుస్తాడు.

ఆనాడు తెలంగాణ ప్రాంతంలో రజాకార్లు ప్రజలను చాలా రకాలుగా హింసించిన తీరును ఈ కథలో ప్రస్తావన చేశారు. రజాకార్ల దోపిడీలలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను రచయిత ఆనాటి తెలంగాణ ప్రాంత వ్యవస్థను ఈ చీకటి రాజ్యం కథలో వివరించారు. ఎంతోమంది అమాయక ప్రజలు రజాకార్ల చేతిలో బలైపోయిన దుస్థితిని లక్ష్మి పాత్ర ద్వారా ఈ కథలో చెప్పడం జరిగింది.

**దౌర్జన్యం:**

దాశరథి రంగాచార్య రాసిన కథ **"మఱ్ఱిచెట్టు"**.ఈ కథలో వస్తువు మఱ్ఱిచెట్టు. మఱ్ఱిచెట్టు ప్రాముఖ్యతను తెలిపే ఈ కథలో ప్రధాన పాత్ర శివయ్య. శివయ్య తంబుర వాయిస్తూ బ్రహ్మం గారి పాటలు పాడుతూ బిక్షాటన చేస్తాడు. శివయ్యకు ఆ మఱ్ఱిచెట్టే నివాసం. శివయ్య భార్య గంగమ్మ. ఇద్దరు బిడ్డలు. ఆ మఱ్ఱి చెట్టు కిందనే సంసార జీవితం గడిపేవారు. వీళ్ళతో పాటుగా మరి కొంతమంది పేదలు కూడా అక్కడే నివాసం ఉంటారు. ఆ చెట్టు నీడలో తరతరాలుగా నివసిస్తూ జీవనం గడుపుతుండేవారు. ఆ మఱ్ఱి చెట్టు పక్కనే శివాలయం. ఎవరో దాత కట్టించింది ఉంటుంది. ఆ దాత పుణ్యమా అంటూ ఆ మఱ్ఱి కింద నివసించే దరిద్రులు, వికలాంగులు శివయ్యతో పాటు ఉంటారు. వారికి దీపాలు కూడా ఉండవు. ఆ మఱ్ఱి చెట్టు కింద ఒక చిన్న లోకం ఉండేది. ఆ లోకానికి గురువు శివయ్య. శివయ్య చెప్పింది అక్కడ వేదం. శివయ్య తప్పు చేయడని వారి నమ్మకం. అలా వారి జీవితం ప్రశాంతంగా సాగిపోతూ ఉండేది.

ఒకరోజు నారాయణ అనే వ్యక్తి వస్తాడు. మఱ్ఱి చెట్టు కింద ఉన్న జనం నారాయణను చూసి భయపడి లేస్తారు. శివయ్య నిద్రపోతూ ఉంటాడు. అతనిని అక్కడ ఉన్న జనం లేపి నారాయణను చూపిస్తారు. నారాయణ ఆ మఱ్ఱిచెట్టు ఉన్న స్థలం తనది అని మీరంతా ఖాళీ చేయాలంటూ గర్జిస్తాడు. ఒక్కసారిగా అక్కడ ఉన్న వారికీ గుండెలు పగులుతాయి. నారాయణ అన్న మాటలకు శివయ్య 'బాబు మేము ఇక్కడ తరతరాలుగా ఉంటున్నాం. వెళ్లిపోమంటే ఎక్కడికి పోతాం. మేము పేదవాళ్ళం. దయ చూపండి మీరు' అని బ్రతిమాలుతాడు. నేను అందర్నీ పొమ్మనడం లేదు. తల పావలా అద్దె కట్టండి ఉంటున్నందుకు అని చెప్తాడు. దానికి శివయ్య సరే అని ఒప్పుకుంటాడు. నారాయణ చెప్పిన మాటలకు అక్కడ ఉన్న జనానికి ఏదో తెలియని భయం పట్టుకుంటుంది. అద్దెకడుతున్నప్పటికీ వారిలో గుబులు చేరుకుంటుంది.

మర్నాడు నారాయణ వచ్చి మర్రిచెట్టు కొమ్మ నరికి తీసుకెళ్తాడు. ఆ మర్రిచెట్టు కొమ్మలు నరికేటప్పుడు శివయ్యకు రెక్కలు విరిచినంత పని అవుతుంది. ఆ మర్రిచెట్టు కింద ఉన్న జనం కన్నీళ్లు కారుస్తారు. కొన్నాళ్ళకి శివయ్య ఆరోగ్యం క్షీణిస్తుంది. మర్రి మరొకరిదని, అతను ఇవాళ కాకుంటే రేపైనా వచ్చి ఆ మర్రిని నరుకుతాడని అక్కడ ఉన్న జనంతో శివయ్య మాట్లాడతాడు. ఆ మర్రిచెట్టు పోతే అక్కడ ఉన్న జనం వారి పరిస్థితి ఏంటని దిగులు చెందుతారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు జనం. శివయ్య ఆరోగ్యం రోజు రోజు క్షీణిస్తుంది. శివయ్య కొడుకులు స్టేషన్ దగ్గర బస్తాలు మోసే పని మోస్తారు. ఇంతకాలం జనానికి ఆశ్రయం ఇచ్చిన మర్రిచెట్టు నరికేస్తే వారి పరిస్థితి ఏంటని శివయ్య కుమిలిపోతాడు.

మరునాడు నారాయణ మంది మార్బలంతో వచ్చి 'కదలండి చెట్టు కింద నుంచి ఇది నాది' అని గద్దిస్తాడు. అక్కడ ఉన్న జనం బాబు అలా అనకు. ఈ వృక్షానికి బీజం ఎంత. ఎవరు వేశారో ఎవరికి ఎరుక. మరి నీది కాదు బాబు. అందరిదీ అద్దె కడుతున్నాం. పుచ్చుకో అందర్నీ ఉండని అని వేడుకుంటారు. జనం బ్రతిమాలుతున్న కరగని నారాయణ మాత్రం మర్రి నాది నేనేమైనా చేసుకుంటా జరపండి రా ముసలి వాడిని అని శివయ్యను తోసేస్తారు. మర్రి కింద ఉన్న జనం గగ్గోలు పెడుతూ నారాయణను ఆపడానికి ప్రయత్నిస్తారు. నారాయణ మాత్రం మాట వినకుండా మర్రిచెట్టుని వారి అనుచరులు నరికి వేస్తారు. శివయ్య భార్య గంగమ్మ ఆ చెట్టును కౌగిలిస్తుంది. గొడ్డలి వేటు ఆమె తలకు తాకటం వల్ల రక్తంతో తడిసిపోతుంది. అది చూసిన శివయ్య ఊపిరి వదిలేస్తాడు. కొన్నాళ్లకు నారాయణ పెద్ద హోటల్ కట్టిస్తాడు. హోటల్ కి కాస్త దూరంలో శివయ్య సమాధి ఉంటుంది.

ఈ కథలో రచయిత దాశరథి గారు ఒక విషాద కవళికలను చిత్రించడం జరిగింది. చెట్టు పచ్చగా గుంపుగా ఉన్న చెట్టు హాయినిస్తాయి. మనసున ఉల్లాసపరుస్తాయి. చెట్లు మనకు తిండి పెడతాయి. ప్రాణవాయువు కూడా ఇస్తాయి. నీడని ఇస్తాయి. చెట్టు నీడ కోసం ఎంతమంది వెతుకుతూ ఉంటారు. చెట్టు నీడకు మాత్రమే కాదు. అనేక విధాల పనికి వస్తుంది. మనిషి చనిపోతే దేనికి పనికి రాడు .కానీ చెట్టు మాత్రం చచ్చిన కూడా మనిషికి పనికి వస్తుంది. మనిషికి బతికి ఉన్న చెట్టే కావాలి. చివరి వరకు చచ్చిన చెట్టే కావాలి. అంతటి వైభవం కలిగిన చెట్టుకు ఆధారంగా రచయిత మర్రిచెట్టు కథను చిత్రించడం జరిగింది. సమాజంలో ఉన్న అనేక పేదవారికి చెట్టేయే నివాసంగా ఉంటుంది. ఆ చెట్టు నీడ కిందలో బ్రతుకుతున్న జనం జీవనాన్ని కొనసాగిస్తారు.

ఈ మర్రిచెట్టు కథలో నారాయణ అనే అతను వచ్చి చెట్టు తనదే అని అమాయక జనాల్ని మోసం చేసి అక్కడ ఉన్న వారిని నీడ లేకుండా చేస్తాడు. ఆ మర్రి చెట్టు కొన్ని వేల సంవత్సరాల నుంచి ఉన్నది. ఉన్నచోట ఎంతో మంది పేదవారు ఆ చెట్టు నీడనే జీవిస్తూ ఉండడం జరుగుతుంది. అన్యాయంగా వారి దగ్గర నుండి అద్దెని తీసుకోవడం. తిరిగే వారిపై దౌర్జన్యం చేయడం నారాయణ చేస్తాడు. ఇటువంటి వ్యక్తులు దుర్మార్గపు పనులు చేస్తూ సమాజంలో ఉన్న పేదవారిపై దౌర్జన్యాన్ని చూపిస్తారు. ఈ కథలో ప్రధానంగా అన్యాయాన్ని నారాయణ పాత్ర ద్వారా రచయిత చిత్రీకరణ చేయడం జరిగింది. నేటి సమాజంలో కూడా ఎంతోమంది చెట్టుని ఆధారంగా జీవిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. కాబట్టి చెట్టుకు ఉన్నటువంటి ప్రాముఖ్యతను ఈ కథలో తెలపడం జరిగింది. అందుకే రచయిత చెట్టు మనిషికి చివరివరకు కావాలనే సందేశాన్ని ఇచ్చాడు.

**మద్యం బానిస:**

అంపశయ్య నవీన్ వ్రాసిన కథ **"కసి"**. ఈ కథలోపాత్రలపేర్లు ఉండవు. నవీన్ రాసిన కథ అంతా కూడా ఉత్తమ పురుష కథనంలో సాగుతుంది. ఈ కథలో ప్రధాన వస్తువు మద్యం. తాగుడికి బానిస అయిన తండ్రి వల్ల ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని విషయాన్నీనీ గురించి చెప్పడం జరిగింది. తండ్రి నిత్యం తాగుతూ భార్యను కానీ పిల్లలను గాని పట్టించుకోని పరిస్థితి ఈ కథలో కనిపిస్తుంది. తండ్రి పోరు పడలేక తల్లి పడుతున్న బాధని చూసి కొడుకు ఎలాగైనా తండ్రిని

చంపాలని అనుకుంటాడు. తాగి వచ్చి ఇంట్లో భార్యను, పిల్లలను ఆకలితో అలమటిస్తున్నటువంటి దుస్థితిని తెచ్చిన తండ్రిని కొడుకు చంపాలని ఆలోచన మొదలవుతుంది. ఒకవైపు తల్లి కష్టం. మరోవైపు కొడుకు నిరంతరం శ్రమిస్తూ ఉంటాడు. ఊరు వదిలి ఇతర ప్రాంతాల్లో వెళ్ళిన కూడా తండ్రి చేస్తున్నటువంటి పనుల వల్ల వారి కుటుంబ స్థితిగతులు చాలా దిగజారుతాయి. ఒక్కొక్కసారి ఆకలి కడుపులతోనే కొడుకు ఉండాల్సిన దుస్థితి వస్తుంది. తండ్రిని చంపడానికి ఎండ్రిన్ అనే మందును తీసుకొచ్చి అన్నంలో కలుపుతాడు. తండ్రి చేస్తున్నటువంటి తప్పులకు చంపిన పాపం లేదనుకుంటాడు. తను రిక్షా తొక్కి దాచుకున్న డబ్బులకు తాగడానికి తన తల్లిని తల మీద కొట్టి డబ్బు తీసుకెళ్ళాడు. ఇలాంటి ఎన్నో ఘోరాలు చేస్తున్న తండ్రికి చంపిన పాపం లేదని ఎండ్రిన్ అనే మందుని కలుపుతాడు.

తండ్రి రాక కోసం చూస్తున్న కొడుకు ఎలాగైనా అన్నం తినిపించాలని ప్రయత్నిస్తాడు. అటు నుంచి వస్తున్న తండ్రి ఒక్కసారిగా కూలిపోతాడు. కొడుకుతో ఒకసారి తన భార్యను చూసుకోవాలని అంటాడు. తన తల్లి లేదని నువ్వు కొట్టిన దెబ్బలకి ఆసుపత్రిలో చేర్పించానని అంటాడు. తండ్రి నోట్లో నుంచి నురగ రావడంతో దానిని చూసి భయపడతాడు కొడుకు. తను చాలా పెద్ద తప్పు చేశానని, మీ అమ్మను కొట్టి డబ్బు తీసుకువెళ్లి మందు షాపు వాడి దగ్గర తన్నులు తిన్నానని, నేను తీసుకెళ్లిన డబ్బులు పాత బాకీ కింద జమ చేశాడని చివరికి నన్ను కొట్టి పంపించారని చెప్తాడు. ఆ బాధతోనే నేను ఎండ్రీన్ మందు తాగానని చెప్తాడు. కొద్దిసేపట్లోనే తండ్రి మరణిస్తాడు. అప్పుడు కొడుకు తన తండ్రిని తానే చంపుకున్నానని అనుకుని ఊహిస్తాడు. తనని పోలీసు వాళ్ళు పట్టుకెళ్తారనని. పారిపోవాలని తనలో ఏదేదో ఆలోచనలు వస్తుంటాయి. కానీ నిజానికి తండ్రి మందు తాగి చనిపోవడం బాధతో ఏడుస్తాడు.

ఈ కథలో ప్రధానంగా రచయిత మద్యానికి బానిస అయినా ఒక తండ్రి కుటుంబం ఎలా చిన్న భిన్నమైందో ఈ కథలో చెప్పడం జరిగింది. మద్యానికి బానిసైన తండ్రి కుటుంబ పోషణ చేయలేక భార్యను, పిల్లలను పట్టించుకోలేక తన లోకం తానే అన్నట్టుగా అప్పుల పాలవుతాడు. చివరికి తానే ఆత్మహత్య చేసుకోవడం జరుగుతుంది. సమాజంలో ఎంతోమంది మద్యానికి బానిసై కుటుంబాన్ని చెల్లాచెదురుగా చేస్తారు. వారి వెనకాల ఒక కుటుంబం ఉందని కూడా గ్రహించలేని స్థితిలో వాళ్ళు ఇష్టానుసారంగా జీవిస్తారు. భార్యా పిల్లల పరిస్థితిని పట్టించుకోని దుస్థితి వారిలో కనిపిస్తుంది. అందుకే కథా రచయిత నవీన్ తన కథలో ప్రధానంగా మద్యాన్ని వస్తువుగా తీసుకున్నారు. మద్యం వల్ల కుటుంబ పరిస్థితి ఏ రకంగా ఉంటుందో ఈ కథలో చాలా చక్కగా వివరించారు.

**మధ్యతరగతి జీవన చిత్రణ:**

ధూపాటి శేషమ్మ రాసిన **‘పరివారిక శిక్ష’** కథ మధ్యతరగతి జీవన చిత్రణకు సంబంధించిన కథ. ఈ కథలో ప్రధాన పాత్రలు చమన్ లాల్, భార్య రమాబాయి. చమన్ లాల్ తన ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని తక్కువ ఖర్చులు చేస్తూ కుటుంబాన్ని గడిపేవాడు. కానీ భార్య మాత్రం డబ్బును అమితంగా ఖర్చు చేసేది. రమాబాయి గొప్పింటి బిడ్డ. దానితో ఆమె కట్టుకుంటున్న చీరలు ఇంట్లో రెండు మూడు రకాల ఆహార పదార్థాలు లేనిదే ఆమెకు తృప్తిగా ఉండదు. అలా డబ్బును అమితంగా ఖర్చు చేసేది. రోజు తమ ఇంటికి రమాబాయి స్నేహితురాలు వస్తారు. ఆ స్నేహితురాలు వచ్చారని తెలిసి మిఠాయిలు తెప్పించి ఫలహారంగా పెట్టడం వారి ఆచారం. అది చూసిన చమన్ లాల్ దిగులుపడేవాడు. భార్య అమిత ఖర్చులు చూసి ఒకసారి ఇలా అంటాడు.

“ఈ విధంగా ఖర్చు చేయుట మంచిది కాదు. రూపాయికొక దమ్మిడి సమముగా ఖర్చు చేయుచున్నావు. ఆలోచించి ఖర్చు చేయుట మంచిది. మనకు స్త్రీ సంతానం కలదు గదా ! వారు గోగుకొమ్మల వలె పెరుగుచున్నారు. వారి వివాహమునకు అగు ఖర్చు తగు సంపదను సమకూర్చవలె కదా ! లేకున్న నలుగురిలో పరువుపోవును. ఈ రీతి వ్యయము చేయుట ధనవంతులకు తగును.

మనబోటి వారికి ఇంతటి వ్యయము విషయములో ఆలోచించాలి. కాబట్టి తగిన వారితో స్నేహము చేయుము. స్వల్ప వ్యయముతోనగు తెల్లని మల్లును కట్టుకొనుము. ఈ రకముగా ఖర్చు పెట్టిన మన జీవితము ఎటుల సాగగలదు"(వరంగల్ కథా సర్వసం:పుట:) అని బోధిస్తాడు. ఆ మాటలు విన్న రమాబాయి మాత్రం విని విననట్టుగానే ఉంటుంది. ఖర్చు విషయంలో ఏ మాత్రం తగ్గదు. నెల అయ్యేసరికి తనకు కావలసిన వస్తువులను తీసుకురమ్మని చమన్ లాల్ కు చెప్తుంది. భార్య ఖర్చులకు లాహోర్ వదిలి సమీపంలో ఒక పల్లెటూరు వస్తారు. లోహర్ లో ప్రతిరోజు నడక ప్రయాణం చేసేవాడు. తను ఉంటున్న ఇంటి దూరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో కాలినడకన నడిచేవాడు. స్నేహితులు సైకిల్ తీసుకోమని చెప్పిన కూడా ఆర్థిక ఇబ్బందులకు డబ్బులు ఖర్చు చేయలేక కాలినడకతో నడుస్తాడు చమన్ లాల్.

ఒకరోజు రమాబాయికి రమర ఖామల్ నుండి ఆహ్వానం వస్తుంది. ఆ ఆహ్వానానికి వెళ్లే వాళ్ళందరూ కూడా మంచి చీరలు, మంచి నగలతో వస్తారు. ఆ ఆహ్వానానికి నేను వెళ్ళను అని రమాబాయి చెబుతుంది. బీరువాలో ఉన్న రెండు చీరలు తీసుకొని వెళ్లొచ్చు కదా అని చమన్ అంటాడు. కానీ రమాబాయి అది ఒక్క చీరే ఉన్నది. ఎన్ని సార్లు కట్టుకోవాలి. దానిపైన మనసు తీరినది. ఆ చీర కట్టుకొని పోతే చూసిన వారందరూ నీకు ఒకటే చీర ఉన్నదా అని అనుకోరా? అప్పుడు నా మనసు ఎంత కష్టం కలుగుతుందో అది నీకు తెలియదా అని సమాధానం ఇస్తుంది.

ఆర్థిక ఇబ్బందులతో చమన్లాల్ తనకు మళ్లీ చీర కొనే ఉద్దేశం లేదని ఇతరులు గొప్పగా మాట్లాడుకోవాలని ఇల్లు దివాలా తీసుకోవడం ఎంతవరకు బుద్ధి తక్కువ పని అని అనుకుంటాడు. రమాబాయి మాత్రం కొత్త చీర తీసుకొస్తే ఆ ఆహ్వానానికి వెళ్తానని నిర్ణయించుకుంటుంది. ఏదో రకంగా చమన్ లాల్ రమాబాయికి చీర తీసుకోవడానికి బయలుదేరుతాడు. రమాబాయి చమన్ లాల్ ను ఇరవై రూపాయల చీర కొనాలంటే నీ దగ్గర డబ్బులు లేదు కదా అని అడిగినప్పుడు, లోహర్ లో దాచుకున్న డబ్బులను తీసి చూపిస్తాడు. అప్పుడు రమాబాయికి భర్త నిజ స్వరూపం తెలుసుకుంటుంది. భర్త తన కోసం, తన పిల్లల కోసం ఎంతో కష్టపడుతున్నాడని తను మాత్రం ఇంట్లో ఉండే వృధా ఖర్చులు చేస్తున్నానని ఏడుస్తుంది. ఇక నుంచి తను కూడా ఏమాత్రం ఖర్చు చేయకుండా ఉంటానని చమన్ లాల్ తో చెబుతుంది.

మర్నాడు ఉదయం చెమన్ లాల్ బజారుకు వెళ్లి తన భార్య కోసం 30 రూపాయల చీరను 25 రూపాయలకే తెస్తాడు. బజారు దాటి బయటకు వచ్చేటప్పుడు జట్కా బండిలు లభించవు. సమయం ఏడు గంటలు అవుతుంది. చమన్ లాల్ ఎదురుచూస్తుంటాడు. కొద్దిసేపటికి ఒక జట్కా వాడు వస్తాడు. ఆ జట్కా బండి లో నలుగురు మనుషులు ఉంటారు. రాత్రిపూట జట్కాబండిలో నలుగురు తప్ప ఎక్కువ మంది కూర్చోవడానికి వీలు ఉండదు. జట్కా వాడు వద్దన్నప్పటికి ఏదో రకంగా చమన్ లాల్ వాడి బండి ఎక్కుతాడు. జట్కా బండి వాడిని ఐదుగురిని ఎక్కించినందుకు జరిమానం విధిస్తారు. ఎంత ప్రాధేయపడ్డా ఆ అధికారులు వదలరు. ఆ జట్కాబండి వాడు మరుసటి రోజు కచేరికి వెళ్లి పంచాయతీలో ఇంకెప్పుడు ఇలాంటి తప్పు పొరపాటున చెయ్యను నన్ను క్షమించండి. పేదవాడిని జరిమానం భరించలేను అని వేడుకుంటాడు. అయినా మెజిస్ట్రేట్ 20 రూపాయలు జరిమానా విధిస్తాడు. జట్కావాడు చమన్ లాల్ వల్ల ఆ జరిమాన విధించడం జరిగింది. కానీ చమన్ లాల్ ఆ జరిమానాన్ని పట్టించుకోకుండా ఇంటికి వెళ్ళిపోతాడు. జట్కావాడి భార్య ఎంతో ప్రాధేయ పడినప్పటికీ కనికరించడు.

కొన్నిరోజుల తర్వాత చమన్ లాల్ కు తీవ్ర జ్వరం వస్తుంది. ఆ జ్వరం తగ్గకపోవడంతో ఆ జ్వరం రావడానికి  కారణం రమాబాయి తెలుసుకుంటుంది. చమన్లాల్ మనసులో తానేదో తప్పు చేశాననే పశ్చాత్తాపం కనిపిస్తుంది. జరిగినది అంతా భార్య రమాబాయితో చెబుతాడు. తనకోసం తెచ్చిన చీరను మళ్లీ అమ్మి ఆ డబ్బులను జట్కా వాడిని ఇస్తుంది. జట్కావాడి భార్య చమన్ లాల్ వినాశనానికి కోరుతున్నప్పుడు రమాబాయి వింటుంది. అప్పుడు జరిగిన దానికి తన భర్త చాలా బాధపడుతున్నాడని అతని ఆరోగ్యం క్షీణించింది. తాను చేసిన తప్పుకు క్షమాపణ కావాలని ఈ డబ్బులను పంపించారని

అంటుంది. ఆ మాటలు విన్న జట్కావాడి భార్య దుఃఖంతో తనను క్షమించమని రమాబాయిని కోరుకుంటుంది. డబ్బులను జట్కావాడి భార్యకిచ్చేసి ఇంటికి వెళుతుంది రమాబాయి. చమన్ లాల్ కు జరిగిన వృత్తాంతాన్ని మొత్తం రమాబాయి చెప్తుంది. తర్వాత చమన్ లాల్ జ్వరం తగ్గిపోతుంది.

ఈ కథలో రచయిత్రి చాలా చక్కని సందేశాన్ని ఇచ్చారు. డబ్బులు ఉన్నప్పుడే వృధా చేసుకోకుండా డబ్బులను అవసరం ఉన్నప్పుడే ఉపయోగించాలి. లేకుంటే అనేక అనర్థాలకు దారి తీస్తుందని ఈ కథలో చక్కని సందేశాన్ని ఇచ్చారు రచయిత్రి. చమన్ లాల్ లాగా భార్య రమాబాయి కూడా ఆలోచించి ఉంటే ఇటువంటి అనర్థాలకు తావు లేకుండా ఉండేది. కానీ భార్య రమాబాయి ఖర్చు ఇతరులను తనని గొప్పగా చెప్పుకోవాలని అహంకారం ఇవన్నీ రమాబాయిలో ఉన్నప్పుడు దానివల్ల భర్త ఆర్థిక స్థితి సరిగా లేకపోయినప్పటికీ భార్య మనసును అర్థం చేసుకునే ఒక చీర కోసం అనేక ఇబ్బందులు పడతాడు. రచయిత్రి కూడా సమాజంలో మధ్యతరగతి కుటుంబాల్లో పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు.

ప్రధానంగా ఈ కథలన్నింటిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధ అంశాలు ఉన్నాయి. సమాజంలో విభిన్న సమస్యలను వరంగల్ రచయితలు తమ కథలో చిత్రించారు. హేతువాద దృక్పథం, రజాకార్ల అణిచివేత, దౌర్జన్యం, మధ్య తరగతి జీవన చిత్రణ సంబంధించిన కథలు ఈ వరంగల్ జిల్లా కథా సర్వస్వంలో ఉన్నాయి. వీటితో పాటుగా స్త్రీ జీవన చిత్రణ, రైతు జీవన చిత్రణ, ప్రపంచీకరణ ప్రభావం, వృత్తి జీవనానికి సంబంధించి కథల వస్తు వైవిధ్యం ఈ సర్వస్వంలో కన్పిస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. అశోక్ కుమార్, కె.పి.2019. కథావిష్కారం.హైదరాబాద్. స్రామాట్ పబ్లికేషన్

2. గిరిజామనోహరబాబు, జి. 2012. కథకు శతమానం. హన్మకొండ. గన్నమరాజు పౌండేషన్

3. మల్లయ్య, కాలువ. 2017. తెలుగులో ప్రగతిశీల కథా సాహిత్యం.హైదరాబాద్. సామాజిక భారత్ ప్రచురణలు

4. వెంకట రమణ.జి.(సం). 2016. అవగాహన (సాహిత్య వ్యాసాలు).హైదరాబాద్. చంద్రకళ పబ్లికేషన్స్

5. శ్రీధర్, వెల్దండి.2015. తెలుగు కథ- ప్రాంతీయ అస్తిత్వం. కర్నూల్. విజయ లక్ష్మీ గ్రాఫిక్స్